కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

అమృతవాణి

10

# గోసంరక్షణ

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

ఎమెస్కో

# విషయ సూచిక


| | |
|---|---|
| గోసంరక్షణ | 7-19 |
| గురు-శిష్యుల సంబంధం | 20- 75 |
| వర్ణధర్మం | 76-112 |
| అంతర్జాల వ్యాసాలు | 113-133 |
| మన దేవతలు | 134-136 |

# గోసంరక్షణ

## గోమాత - భూమాత

**గో**వును తల్లిగా భావిస్తున్నాం. మాట్లాడలేని జంతువులలో అమ్మా అని పలికేది గోమాత. తల్లి మాదిరిగా సాకుతోంది. తల్లి, పిల్లలకు పాలిచ్చినట్లు గానే గోమాత పాలనిచ్చి రక్షిస్తోంది. మనం ముసలివారమైనా మనకు పాలు, పెరుగు, నేతులనందిస్తోంది. అందుకే గోమాత అంటున్నాం.

ప్రేమ, శాంతి స్వరూపిణిగా సాక్షాత్కరిస్తోంది. జనకమాతతో బాటు, మనకింకా ఇద్దరు తల్లులున్నారు. వారే గోమాత, భూమాతలు.

తల్లి, గోవు మనకు పాలనిచ్చినట్లుగా భూమి పంటలను, లోహాలను, నీటిని అందిస్తోంది. అందుకే భూమిని, భూమాత యని పిలుస్తున్నాం. అసలు భూమాతయే గోమాతగా అవతరించింది. ద్వాపరయుగం అంతమై కలి ప్రారంభించినపుడు అసుర గుణాలు విజృంభించగా భూమాత సహించలేకపోయింది. బ్రహ్మతో కలిసి భూమాత, విష్ణువును ఆశ్రయించి మొరపెట్టింది.

అందుకే ద్వాపరాంతంలో విష్ణువు కృష్ణునిగా అవతరించాడు. భూమాత, విష్ణువు యొక్క భార్యగా వెళ్ళకుండా గోమాత రూపంలో వెళ్ళినట్లుంది. అందుకే ఆమెపట్ల దయను, ప్రేమను చూపించాడు. అందుకే గోపాలుడై గోవులతో తిరిగాడు.

గో అంటే భూమి అని కూడ అర్థం. కృష్ణుడు పూర్ణావతారం. భాగవతం ప్రకారం విష్ణుని అవతారాలు 24. ఇందు పది మినహాయిస్తే మిగిలినవి అంశావతారాలు. అందొక అవతారం పృథు చక్రవర్తి. అతడే భూమిని చదును చేసి రాష్ట్రంగా, నగరాలుగా తీర్చిదిద్దినవాడు. అతడు భూమాతను గోమాతగా దర్శించాడు. స్వధర్మాన్ని దూడగా చేసి దేవతలందరూ తమ అభీష్ట సిద్ధిని పొందారు.

ఇట్లా ఆవుపట్ల ప్రేమను చూపించాడు. ఆవు, ఇతనిపట్ల ప్రేమను చూపించింది. స్వామి వేణుగోపాల రూపంలో ఉండగా అతని పాదపద్మాన్ని ఆవు నాకుతున్నట్లుగా ఉంటుంది.

## శ్రీమాత - గోమాత

అన్ని మాతలకు మూలమైనది శ్రీమాత. ఈమె చరాచర వస్తు ప్రపంచానికి తల్లి. ఆమె కృపా క్షీరాన్నే జనకమాత, గోమాత పాలరూపంలో అందిస్తున్నాయి. ఆమెవల్లనే భూమాత, నీరు, పంటల రూపంలో అందిస్తోంది.

లలితా సహస్రనామాలలో అమ్మవారికొక నామం, గోమాత. అసలు మొదటి నామమే శ్రీమాత. నామావళిలో గురుమూర్తి, గుణనిధి అనే నామాలున్నాయి. తమిళనాడులోని తంజావూరు జిల్లాలో తిరుచెందూరులో అమ్మవారు, గోమాతగా అవతరించినట్లు స్థలపురాణం చెబుతోంది. అమ్మవారి సోదరుడు, మహావిష్ణువు, గోపాలకృష్ణునిగా అవతరించాడని కథ. ఆమె గోరూపంలో ఉండగా ఆమెను రక్షించాడని పశుపతితో వివాహం జరిపించాడని కథ

## భౌతిక, వైదికమైన సంపత్తి

భౌతికమైన పాలనిచ్చుటచే భౌతికతృప్తి కారకమే గాక, వైదికమైన ప్రయోజనాలను గోద్రవ్యం అందిస్తోంది.

ఇంద్రియాలకు తృప్తి నిచ్చుట భౌతికమైతే అనగా లౌకికమైతే, ఆత్మదీప్తికి ఉపయోగించేది వైదికం. రెంటిని ప్రసాదిస్తుంది గోమాత.

లోకంలో పోషక పదార్థాలు చప్పున జీర్ణంకావు కాని ఆవుపాలు సర్వవిధాల పోషకమైనా చిన్నపిల్లలు కూడా సులభంగా జీర్ణం చేసుకొనగలరు. అంతేకాదు, రోగులకు, అల్పబలం కలవారికీ ఉపయోగకరం.

వైదిక దృష్టితో చూస్తే సత్త్వగుణాన్ని పెంచుతుంది. ఈ మాటను వట్టి నమ్మకంతో చెప్పడంలేదు. సాధువులు పాలను మాత్రమే తాగుతారు. వారు సత్వగుణంతో ఉంటారు.

నామాలలో గోమాతముందు గురుమూర్తి, గుణనిధి అనే మాటలున్నాయి. అంటే ఎవరైనా గుణనిధిగా, గురుమూర్తిగా మారాలంటే గోక్షీరాన్ని సేవించాలన్నమాట. అట్టి పవిత్రమైన ఆహారం పాలు.